# యువ వెలుగు

యువ వెలుగు - ప్రజల వెలుగు | PRGI:- TGTEL/26/A6429 | తెలుగు దిన పత్రిక

www.yuvavelugu.com | Epaper.yuvavelugu.com | yuvavelugu tv

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ ఎడిటర్ : పి.మహేష్ గౌడ్ సంపుటి : 1 సంచిక : 21 బుధవారం, సెప్టెంబర్ 23, 2026 , పేజీలు - 04 వెల: 2/-



యువ వెలుగు

తెలుగు దిన పత్రికలో పని చేయుటకు

రిపోర్టర్లు కావలెను PRESS

మండలం | నియోజకవర్గం | జిల్లా

వారీగా రిపోర్టర్లు కావలెను

9908 502 602


## బెస్ట్ కార్పొరేషన్‌గా నల్లగొండను తీర్చిదిద్దుతాం



**నీలగిరి, సెప్టెంబర్ 22 :** నల్లగొండ కార్పొరేషన్‌లో అన్ని సౌకర్యాలు కల్పించి స్మార్ట్ సిటీగా తీర్చి దిద్దడమే కాక బెస్ట్ కార్పొరేషన్ అవార్డు కూడా అందుకుంటామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమా టోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రం లోని తన క్యాంపు కార్యాలయం ఇందిరాభవన్ వద్ద నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో పరిశు భ్రతకు సంబంధించి కోటి 1 లక్ష రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన రెండు వెట్టింగ్ మెషిన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఇటీవల నల్లగొండ కార్పొరేషన్ స్వచ్ఛ అవార్డు అందుకుందని, నూతనంగా ఏర్పాటైన నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లోని ప్రజలకు అన్ని రకాల సేవలు అందించేందుకు కృషి చేయడం జరుగుతున్నదని తెలిపారు. ముఖ్యంగా 24 గంటలు తాగునీరు అందించేందుకు రూ.83 కోట్లతో టెండర్లు పిలవడం జరిగిం దన్నారు. నల్లగొండ కార్పొరేషన్‌లో ఎస్ డి ఎఫ్ నిధులతో 63 కిలోమీటర్ల సీసీ రోడ్లు వేశామని, అలాగే తక్కిన డివిజన్లలో కూడా రోడ్లతో పాటు, డ్రైన్లు నిర్మిస్తామని, 6 నెలల్లో ఎస్‌టీపీ పూర్తి చేయను న్నట్లు మంత్రి తెలిపారు. నల్లగొండ కార్పొరే షన్‌కు అన్ని రకాల నిధులను తీసుకువచ్చి అభి వృద్ధి చేసి ఉత్తమ కార్పొరేషన్ అవార్డు తీసుకుం టామనే నమ్మకం తమకున్నట్లు మంత్రి తెలి పారు. నల్లగొండ కార్పొరేషన్ పరిధిలో రూ. 900 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేప ట్టామని, అలాగే డ్రైనేజీ, ఎస్ టి పి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ, ఆర్ అండ్ బి అధికారులు, పాల్గొన్నారు.

## దళితులు, ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- దళితులు, ఆదివాసీ, గిరిజనుల కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.
- ఎస్టీలకు 17 శాతం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని గుర్తు చేశారు.
- అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.



**హైదరాబాద్ :** దళితులు, ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్న సీఎం రేవంత్ రెడ్డి దళితులు, ఆదివాసీ, గిరిజనుల కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయిస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్లలో 31 శాతం లబ్ధిదారులు దళితులేనని అన్నారు. ఎస్టీలకు 17 శాతం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని గుర్తు చేశారు. అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. చదువు, క్రీడలవైపు ప్రోత్సహించాలి సన్నబియ్యంతో దళిత, గిరిజన వర్గాలకు మంచి భోజనం అందిస్తున్నామని, అత్యాచార ఘటనలపై ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందిస్తోందని రేవంత్ రెడ్డి వెల్లడించారు. అత్యాచార బాధితులకు పరిహారాన్ని గ్రీన్‌ఛానల్ ద్వారా విడుదల చేయిస్తున్నామని పేర్కొన్నారు. పిల్లలను చదువు, క్రీడలవైపు ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. సొంత తల్లిలా ప్రేమ చూపించిన ఇందిరమ్మను ఇప్పటికీ మరిచిపోలేదని, 25 లక్షల ఎకరాలకు అసైన్డ్ పట్టాలు అందించిన ఘనత ఇందిరాగాంధీదని కొనియాడారు. ఇందిరా గాంధీ స్ఫూర్తితోనే ఈ ప్రభుత్వం పనిచేస్తుందని, బడ్జెట్?లో జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయిస్తున్నామని, ప్రభుత్వం ఈ వర్గాల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని, రాష్ట్రంలో 3 కోట్ల 48 లక్షల మందికి తెలంగాణలో సన్న బియ్యం అందిస్తున్నామని, సన్న బియ్యంతో దళిత, గిరిజన వర్గాలకు మంచి భోజనం అందించగలుగుతున్నామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, అత్యాచార ఘటనలపై ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందిస్తోందని, బాధితుల నష్టపరిహారాన్ని బడ్జెట్?తో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానెల్?లో విడుదల చేయాలని అధికారులను ఆదేశిస్తున్నానని వెల్లడించారు.

## కొత్త పెన్షన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు..
# దసరాకు ముందే పంపిణీ!



**హైదరాబాద్, సెప్టెంబర్ 22:** తెలంగాణలో కొత్త పెన్షన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్‌లో కొత్త పెన్షన్ల ప్రారం భానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దసరా పండుగకు ముందే అర్హులైన లబ్ధిదారులకు కొత్త పెన్షన్లు అందేలా చూడాలని సూచించారు. క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశిం చారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్‌కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఒంటరి మహిళలు, వితంతువులకు పూర్తి స్థాయిలో పెన్షన్లు అందజేయాలని మంత్రి సూచించారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పెన్షన్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దసరా నాటికి కొత్త పెన్షన్ల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. అర్హు లైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## ఏపీ పట్టణాలకు కొత్త కళ.. రూ.11,359 కోట్ల భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం



**ఎన్టీఆర్ జిల్లా, సెప్టెంబర్ 22** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పట్టణాల రూపురేఖలను సమూలంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ఒక బృహత్తర కార్యక్రమానికి నేడు శ్రీకారం చుట్టనుంది. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) విధానంలో రూ.11,359 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గమైన కుప్పం నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని 106 నియోజకవ ర్గాల పరిధిలో ఉన్న 123 మున్సిపాలిటీల్లో ఏకకాలంలో పనులు మొదలు కానున్నాయి. ఈ మెగా ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రూ.7,469 కోట్లు, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలో ప్రత్యేకంగా రూ.3,890 కోట్ల విలువైన పనులను చేపట్టనున్నారు. ఈ నిధులతో ప్రధానంగా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా రోడ్ల నిర్మాణానికి రూ.4,656 కోట్లు, సెంట్రల్ మీడియన్ల ఏర్పాటుకు రూ.88 కోట్లు, కొత్త స్ట్రీట్ లైటింగ్ కోసం రూ.247 కోట్లు, పార్కుల అభివృద్ధికి రూ.509 కోట్లు కేటాయించారు. ఈ కార్యక్రమం పూర్తయితే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,165 కిలోమీటర్ల రోడ్లు, 502 పార్కులు, 210 కిలోమీటర్ల సెంట్రల్ మీడియన్లు, 391 కిలోమీటర్ల మేర స్ట్రీట్ లైటింగ్, 300 కిలోమీటర్ల సీవరేజ్ డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి వస్తాయి. పట్టణ స్థానిక సంస్థలపై ఒకేసారి ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ పనులను హెచ్ఏఎం పద్ధతిలో అమలు చేస్తోంది.

## చిన్న పిల్లల మరణాలకు సీఎం రేవంత్ రెడ్డే బాధ్యత వహించాలి



**అదిలాబాద్ జిల్లా :** రిమ్స్ హాస్పిటల్‌లో కరెంట్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో ముగ్గురు చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరంమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ దుర్ఘటనలో ఇంకా 23 మంది పసిపిల్లలు గాయపడిన నేపథ్యంలో వెంటనే మెరుగైన చికిత్స అందించి వారి ప్రాణాలు కాపాడాలన్నారు. కాంగ్రెస్ సర్కారు ఘోర వైఫల్యం వల్లే ఇంత పెద్ద ప్రమాదం జరిగి, అభంశుభం తెలియని పిల్లలు అన్యాయంగా బలైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి ప్రభుత్వ వైద్య రంగాన్ని పూర్తిగా విధ్వంసం చేసిన సీఎం రేవంత్ రెడ్డే ఈ సంఘటనకు పూర్తి బాధ్యత వహించాలన్నారు. రిమ్స్ హాస్పిటల్‌లో నెలకొన్న దుస్థితులపై అనేకసార్లు బీఆర్ఎస్ జిల్లా నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించినా మొద్దునిద్ర పోయిన రేవంత్ సర్కారులో కనీస చలనం కనిపించలేదు. అత్యంత పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన పిల్లల వార్డులో ప్రభుత్వ పర్యవేక్షణ పూర్తిగా లోపించడం, కనీస నిర్వహణ లేకపోవడం వల్లే ఈ దురదృష్టకర సంఘటన చోటుచేసుకుందన్నారు. ఆదిలాబాద్ రిమ్స్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ దవాఖానల్లోని పిల్లల వార్డులు, ఐసీయూలను నిపుణులతో తనిఖీ చేయించి ఇలాంటి సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రేవంత్ సర్కారు చేతకానితనం వల్ల తమ పసిపిల్లలను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాచెల్లించిఆదుకోవాలనిడిమాండ్ చేశారు.

## ఆదిలాబాద్ రిమ్స్‌లో ఘోర విషాదం అగ్నిప్రమాదంలో
# ఇద్దరు పసికందుల మృతి

- ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో ఘోర అగ్నిప్రమాదం
- ఎస్ఎన్‌సీయూ వార్డులో మంటలు చెలరేగి ఇద్దరు శిశువుల మృతి
- 28 మంది చిన్నారులను సురక్షితంగా కాపాడిన సిబ్బంది
- షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా
- ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి, విచారణకు ఆదేశం



**ఆదిలాబాద్ :** తెలంగాణలోని ఆదిలాబాద్ రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లో సోమవారం అర్ధరాత్రి ఘోర విషాదం చోటుచేసుకుంది. ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ)లో అగ్నిప్రమాదం జరగడంతో ఇద్దరు నవజాత శిశువులు మరణించారు. అప్రమత్తమైన సిబ్బంది వార్డులోని మరో 28 మంది చిన్నారులను సురక్షితంగా బయటకు తరలించడంతో పెను ప్రమాదం తప్పింది. సోమవారం రాత్రి సుమారు 11:50 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఎయిర్ కండిషనర్ (ఏసీ)లో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు అధికారులు భావిస్తున్నారు. కొద్దిసేపట్లోనే వార్డు మొత్తం దట్టమైన పొగ, అగ్నికీలలతో నిండిపోయింది. అయితే, ప్రమాదానికి కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, దర్యాప్తు తర్వాతే స్పష్టత వస్తుందని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

## జన్వాడ ఫాంహౌస్.. నాలాపై కట్టిన అక్రమ నిర్మాణమే

**రంగారెడ్డి జిల్లా:** శంకర్‌పల్లి మండలం జన్వాడలోని వివాదాస్పద ఫాంహౌస్‌ను (కేటీఆర్ ఫాంహౌస్ గా ఆరోపణలు) కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యుల బృందం నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసనకు దిగి కాంగ్రెస్ బృందాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ పరిశీలన అనంతరం మాట్లాడిన నాగర్ కర్నూలు ఎంపీ మల్లు రవి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి... జన్వాడ ఫాంహౌస్ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని, మురుగునీటి కాలువ (నాలా) పైనే ఈ అక్రమ నిర్మాణాన్ని చేపట్టారని ఆరోపణలు చేశారు.

## ఏపీలో రైతుల కేరింతలు.. తెలంగాణలో రైతుల ఆక్రందనలు



**హైదరాబాద్ :** విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వం ఫెయిల్ అయిందని.. యాదాద్రి పవర్ ప్లాంట్ పూర్తి సామర్థ్యం 4 వేల మెగా వాట్లకు 400 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ విజన్ తో దేశంలో ఎక్కడా లేని విధంగా యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్ ప్లాంట్ ను నిర్మించారు. యాదాద్రికి జీ10, జీ11 క్వాలిటీ కోల్ కావాలి. కానీ జీ13,జీ14 క్వాలిటీ కోల్ వాడుతున్నారు. బొగ్గు వాడకంలో నాణ్యతా లోపం ఉంది. కొత్తగూడెంలో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఆగింది. భద్రాద్రిలో 540 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఆగింది. 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉంటే ఈ రోజు బొగ్గు కొరత ఎందుకు ఏర్పడుతుంది. ఈ నిల్వలు ఎక్కడ అని ప్రశ్నించేందుకు నేను క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళితే పోలీసులు అడ్డుకున్నారని మండిపడ్డారు. రాష్ట్ర విభజన సందర్భంగా 1600 మెగావాట్ల విద్యుత్ ఎన్.టి.పి.సి ద్వారా ఇస్తామని చెప్పారు. మేము తొలివిడతగా ఎన్టీపీసీ 800 మెగావాట్ల కేంద్రాన్ని స్థాపించేలా చర్యలు తీసుకుని పవర్ తీసుకున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం వద్దు అని ఎందుకు ఖర్చు లేని పనికి ఎందుకు నో చెబుతోంది. మన దగ్గర తయారు అయ్యే సింగరేణి ఉత్పత్తి విద్యుత్ వద్దు అని రాజస్తాన్ ప్రభుత్వంతో పీపీఏ కుదుర్చుకున్నారు. రాజస్తాన్‌కు కరెంటు ఇవ్వాల్సిన అవసరం ఏముంది..? అని ప్రశ్నించారు.

# పాము కాటుకు గురై మృతి చెందిన పాడి గేదె..



**జనగామ జిల్లా:**
దేవరుప్పుల మండల కేంద్రంలో పాము కాటుకు గురై పాడి గేదె మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది.స్థానికంగా అందిన వివరాల ప్రకారం కొత్తకాలనీకి చెందిన తోటకూర సోమయ్య, తండ్రి ఐలయ్యకు చెందిన పాడి గేదెను ప్రతిరోజులాగే ఉదయం బావి (దొడ్డి) వద్దకు వెళ్లి చూసే సరికి అప్పటికే పాముకాటుకు గురై మృతి చెంది కనిపించింది.గేదె మృతి చెందిన విషయం తెలుసుకున్న రైతు సోమయ్య తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.పాడి గేదెపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తమ కుటుంబానికి ఈ ఘటనతో ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఒక్కసారిగా పాడి గేదెను కోల్పోవడంతో కుటుంబ పోషణపై ప్రభావం పడుతుందని తెలిపారు.వ్యవసాయంతో పాటు పాడి పశువులపై ఆధారపడి జీవిస్తున్న తమలాంటి రైతులకు ఇలాంటి ఘటనలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని స్థానికులు పేర్కొన్నారు.సంబంధిత అధికారులు సంఘటనను పరిశీలించి పశువైద్య సిబ్బంది ద్వారా మృతిచెందిన గేదెకు సంబంధించిన వివరాలను నమోదు చేసి,నిబంధనల ప్రకారం ప్రభుత్వ సహాయం అందించాలని రైతు కోరుతున్నారు.ప్రభుత్వం స్పందించి పాడి గేదెను కోల్పోయిన తమ కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు,తగిన పరిహారం అందించి న్యాయం చేయాలని బాధిత రైతు సోమయ్య వేడుకుంటున్నారు.

# భక్తిశ్రద్ధలతో గణపతి కుంకుమార్చన ఆధ్యాత్మిక శోభతో ఆలయ ప్రాంగణం..



**జనగామ జిల్లా:**
దేవరుప్పుల మండల కేంద్రంలో ఈరోజు ఆర్టీసీ, బీసీ కాలనీలో గణేశ్ నవరాత్రుల సందర్భంగా గణపతి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహికంగా కుంకుమార్చన పూజ చేశారు.గణనాథుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం మహిళలు కుంకుమార్చనలో పాల్గొని స్వామివారిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు.కుంకుమార్చన సందర్భంగా మహిళలు గణపతికి కుంకుమ, పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి దర్శనం చేసుకున్నారు.భక్తుల గణపతి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## బొజ్జం పెద్ద యాకయ్య భౌతిక దేహాన్ని సందర్శించి వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన ఏల సుందర్..



**జనగామ జిల్లా:**దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన బొజ్జం పెద్ద యాకయ్య ఈరోజు ఉదయం మరణించగా ఈ విషయం తెలుసుకొని యాకయ్య ఇంటికి వెళ్లి వారి పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులర్పించి వారి కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందజేసిన బిఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు,సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.వారి వెంట బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు,యువజన నాయకులు,గ్రామస్థులు తదితరులున్నారు.

**రంగారెడ్డి జిల్లా పీసీసీ అధ్యక్షురాలుగా, చిగురింత పారిజాత రెడ్డి గారు. ఎన్నికైన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు నరసింహ గౌడ్‌లిగారు కలిసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది...**



# శ్రీ స్వాతి ఎలక్ట్రికల్ హార్డ్వేర్‌డవైన్డింగ్ షాపును ప్రారంభించిన ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు.

**జనగామ జిల్లా:**
దేవరుప్పుల మండలం,సింగరాజుపల్లి గ్రామం ప్రధాన రహదారి ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ స్వాతి ఎలక్ట్రికల్ హార్డ్వేర్‌డవైన్డింగ్ షాపును ఎర్రబెల్లి దయాకర్ రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్,మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సతీమణి ఉషా దయాకర్ రావు ప్రారంభించారు. ఈ షాపును ధరావత్ తండా మాజీ సర్పంచ్ భానోత్ గేమా నాయక్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన ఎలక్ట్రికల్,హార్డ్వేర్ సామగ్రి అందుబాటులో ఉండేలా షాపును ఏర్పాటు చేయడం అభినందనీయమని,వ్యాపారం అభివృద్ధి చెందాలని,వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి,బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్,మండల నాయకులు ఏల సుందర్,వంగ అర్జున్,యూత్ అధ్యక్షుడు నవీన్ నాయక్,పానుగంటి కృష్ణ,మేకపోతుల నరసింహ,కత్తుల సోమిరెడ్డి,కొమ్ము రాములు,గోపాల్ దాస్ మల్లేష్,గడ్డం రాజు,గ్రామస్తులు, స్థానిక నాయకులు,వ్యాపారవేత్తలు తదితరులు పాల్గొన్నారు.



# భూ రీ-సర్వే పనులను వేగవంతం చేయండి

**- నెలన్నరలోగా పూర్తి చేయాలి**
**- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాలు**

**భద్రాద్రి కొత్తగూడెం**
భూ రీ-సర్వే పనులను వేగవంతం చేసి నెలన్నరలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. కొత్తగూడెం మండలం రామవరం రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుజాతనగర్ రామవరం గరీబ్ పేట ట్రైజంక్షన్ వద్ద జరుగుతున్న సర్వే పనులను పరిశీలించి సర్వే పురోగతి భూ హద్దుల నిర్ధారణ సర్వే నంబర్లు భూముల విస్తీర్ణానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రామవరం రెవెన్యూ పరిధిలో సుమారు 1,950 ఎకరాల భూమికి రీ-సర్వే నిర్వహించాల్సి ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటికే గ్రామ సరిహద్దుల నిర్ధారణ చేపట్టడంతో పాటు అటవీ భూముల హద్దులను కూడా పరిశీలించినట్లు తెలిపారు. సర్వే పరిధిలో సుమారు 146 ఎకరాల మేర అటవీ భూమి ఉన్నట్లు వివరించారు. సర్వే నంబర్లు 23, 30, 31 తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. సర్వే నంబర్ 20లో పట్టా అసైన్‌మెంట్ అటవీ భూములు కలిసి ఉన్నందున ఆయా భూముల హద్దులను రికార్డుల ఆధారంగా స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. అటవీ భూముల హద్దులు ఇప్పటికే నిర్ధారితంగా ఉన్న ప్రాంతాల్లో అనవసర జాప్యం లేకుండా మిగిలిన రీ-సర్వే





పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే పరిధిలో పోడు సాగు చేస్తున్న భూములు ఉన్నాయని అర్హులైన వారికి ఆర్ ఓ ఎఫ్ ఆర్ కింద హక్కులు కల్పించినట్లు అధికారులు వివరించారు. సుమారు 420 మందికి పైగా పట్టాదారులు ఉన్నారని ఇందులో గిరిజనులు ఇతర వర్గాలకు చెందిన వారు ఉన్నట్లు తెలిపారు. రీ-సర్వే ద్వారా భూ హద్దులు స్పష్టమై హక్కుదారులకు ప్రయోజనం కలిగేలా రికార్డులను పక్కాగా రూపొందించాలని కలెక్టర్ సూచించారు.
సమ్మక్క గద్దె సమీప ప్రాంతం నుంచి సుమారు 2.3 నుంచి 2.5 కిలోమీటర్ల మేర సరిహద్దు సర్వే నిర్వహించినట్లు అధికారులు వివరించారు. అక్కడ ఉన్న పాత సరిహద్దు రాళ్లు మ్యాప్‌లు రికార్డులను పరిశీలించి హద్దులను ఖచ్చితంగా నిర్ధారించాలని కలెక్టర్ ఆదేశించారు. రీ-సర్వే పనులను ప్రణాళికాబద్ధంగా వేగవంతంగా చేపట్టి నెలన్నరలోగా మొత్తం ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ భూ హద్దులను స్పష్టంగా నిర్ధారించి భూ రికార్డుల్లో ఎలాంటి అయోమయానికి తావులేకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో తహసీల్దార్ పుల్లయ్య, సర్వేయర్ అశోక్, ఆర్ఐ గణపతి, లైసెన్సుడ్ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, అటవీశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

**- శాంతియుతంగా నిమజ్జనం నిర్వహించాలి**
**- భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**భద్రాద్రి కొత్తగూడెం**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా సుమారు 1,000 మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. నిమజ్జన శోభాయాత్రలు జరిగే ప్రధాన మార్గాలు నిమజ్జన ప్రదేశాలు రద్దీ ప్రాంతాలు సున్నితమైన ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భద్రాచలం నిమజ్జనం ఘాట్ వద్ద పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు. భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఘాట్ పరిసరాల్లో పోలీస్ సిబ్బందిని అధిక సంఖ్యలో మోహరించి రద్దీ నియంత్రణ వాహనాల రాకపోకలు పార్కింగ్ శోభాయాత్రల క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ వాహనాల మళ్లింపు పార్కింగ్ క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం




పూర్తయ్యే వరకు పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. శోభాయాత్రల్లో డీజేలు అధిక శబ్దాన్ని కలిగించే సౌండ్ సిస్టమ్స్ టపాసులకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడపడం పూర్తిగా నిషేధమని నిమజ్జన సమయంలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.
నిమజ్జన ప్రదేశాల్లో గజ ఈతగాళ్లు రెస్క్యూ సిబ్బంది అత్యవసర సేవల బృందాలు రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదకరమైన నీటి ప్రాంతాలను ముందుగానే గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రద్దీ ప్రాంతాల్లో బ్లూకోట్స్, మొబైల్ పెట్రోలింగ్, ట్రాఫిక్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా పోలీస్ అగ్నిమాపక వైద్య రెవెన్యూ మున్సిపల్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.
నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని ఆదేశించారు.గణేష్ మండపాల నిర్వాహకులు శోభాయాత్ర నిర్వాహకులు పోలీస్ శాఖ సూచనలు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని శోభాయాత్ర సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. గణేష్ నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ప్రజలు పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# కొండపైన కారు బీభత్సం. యాచకురాలు మృతి.

**ఆలయ సంప్రోక్షణ అనంతరం దర్శనాలు పునఃప్రారంభం.**

**యాదగిరిగుట్ట,**
యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలోని కొండపైన మంగళవారం ఉదయం కారు బీభత్సం సృష్టించింది. కొండపైన బస్టాండ్ ప్రాంగణంలో భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్న యాదగిరిగుట్టకు చెందిన ఈశ్వరమ్మను వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి




కారణమైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆలయం మూసివేసి అనంతరం సంప్రోక్షణ చేసిన ఆలయ అర్చకులు.కొండపైన మహిళ మృతి చెందడంతో ఆలయ అధికారులు వెంటనే ఆలయ ద్వారాలను మూసివేసి భక్తుల దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఆలయ ప్రధాన అర్చకులు, వైదిక బృందం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిసరాలతో పాటు ప్రమాదం జరిగిన బస్టాండ్ ప్రాంగణం, కొండపైన పరిసర ప్రాంతాలు, పుష్కరిణి వద్ద ప్రత్యేక సంప్రోక్షణ పూజలు చేపట్టారు. కార్యక్రమాలు పూర్తయిన అనంతరం ఆలయంలో భక్తుల దర్శనాలను తిరిగి ప్రారంభించారు.

# జూరాల సందర్శనకు వెళ్తున్న రాంచందర్‌రావు అరెస్ట్ - ఖండించిన బండి సంజయ్

హైదరాబాద్:జూరాల ప్రాజెక్టు జల జగడం రాజకీయంగా రసవత్తరంగా మారి ంది. సోమవారం బీఆర్ఎస్ కార్యకర్తలు, రైతులు, పోలీసులకు మధ్య వాగ్వాదాలు చోటుచేసుకోగా, తాజాగా ప్రాజెక్టు సంద ర్శనకు బీజేపీ పిలుపునివ్వడంతో జడ్చర్ల వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జలాశయం వద్దకు వెళు తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును పోలీసులు అరెస్టు చేశారు. దీంతో అక్కడ గందరగోళ వాతావరణం తలెత్తింది.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అరెస్టుజూరాల నుంచి నీటిని విడుదల చేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ జూరాల సందర్శనకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో ప్రాజెక్టు వద్దకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును పోలీసులు అరెస్టు చేయ డంతో గొడవ మరింత ముదిరింది. రాంచందర్‌రావు అరెస్టుకు నిరసనగా కాషాయం కార్యకర్తలు జడ్చర్ల జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్నారు. రైతుల క్షేమం కోసం పాటుపడుతున్న తమను అరెస్టు చేయడాన్ని రాంచందర్ రావు, నేతలు తప్పుబట్టారు. అరెస్టుతో తమ లక్ష్యం ఆగదని పేర్కొన్నారు.పలువురు నేతల హౌస్ అరెసు.ఈ క్రమంలో బీజేపీ శ్రేణులను ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకుంటున్నారు. ప్రాజెక్టును సందర్శించేందుకు వెళ్తున్న జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డిని పోలీసులు ఉదయం 6



గంటలకు వారి నివాసం వద్ద గృహ నిర్బంధం చేశారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండల వెంకటరాములు, పార్టీ నేత వెంకటేశ్వర్ రెడ్డిని జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించే పర్యటనలను అడ్డుకోవడం సరికాదని పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు.నీళ్లు ఇవ్వకపోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలుతనను గృహనిర్బంధం చేయడంపై డీకే స్నిగ్ధారెడ్డి పోలీసుల తీరును ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు నీళ్లు ఇవ్వరు నీళ్లు అడిగే వాళ్లను అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే పంటలను దృష్టిలో పెట్టుకొని నీటిని విడుదల చేయాలని ఆమె కోరారు. ఎగువ ప్రాంతాల్లో ఉన్న ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా ఉన్నాయని, అక్కడి నుంచి ఒక 5 టీఎంసీలు దిగువ జూరాలకు విడుదల చేసుకుంటే ఇక్కడున్న రైతులకు సాగునీరు అందించవచ్చని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో సంప్రదింపులు చేసి నీటిని విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఒకవేళ రైతులకు ఇవ్వకపోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆమె అన్నారు.రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన నడుస్తోందా? రాంచందర్‌రావు అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని కేంద్రమంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. బీజేపీ నాయకుల హౌస్ అరెస్టులు దుర్మార్గమని చెప్పారు. జూరాల ప్రాజెక్టును సందర్శించి రైతులను కలిసేందుకు వెళ్తే తప్పేముందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన నడుస్తోందా, నిర్బంధ పాలన నడుస్తోందా అని నిలదీశారు. రాంచందర్‌రావు సహా బీజేపీ నేతలను వెంటనే విడుదల చేయాలని కోరారు. జూరాల ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడాలన్నారు. తక్షణమే ఎగువ నుంచి జూరాల ప్రాజెక్టుకు 1,700 క్యూసెక్కుల వరద నీరు చేరింది. ఎగువ నుంచి వస్తున్న వరదను అనుసరించి నీటిని విడుదల చేసే యోచనలో అధికారులున్నారు. ఎన్నిరోజులు నీటిని వదలాలనే అంశంపై అధికారులు సాయంత్రం నిర్ణయం తీసుకోనున్నారు.

## జూబ్లీహిల్స్ సీఐకి సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట



హైదరాబాద్ : మహిళపై లైంగిక వేధింపుల ఆరోపణలతో సస్పెన్షన్ వేటు పడిన జూబ్లీహిల్స్ సీఐ శ్రీనివాసులు రెడ్డికి సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. తదుపరి విచారణ వరకు శ్రీనివాసు రెడ్డిని అరెస్టు చేయవద్దని లేదా అతడిపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.మంగళవారం ఈ కేసును జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా పై విధంగా హైదరాబాద్ నగర పోలీసులను ఆదేశించింది. అనంతరం ఈ కేసు విచారణను ధర్మాసనం వాయిదా వేసింది.ఓ మహిళను జూబ్లీహిల్స్ మాజీ స్టేషన్ హౌస్ ఆఫీసర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి లైంగికంగా వేధించాడు. అంతేకాకుండా ఆమెను బ్లాక్‌మెయిల్ చేసి బలవంతంగా అబార్షన్ చేయించాడంటూ తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఇటీవల అతడిపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ఈ నేపథ్యంలో అతడు ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించాడు. అందుకు కోర్టు నిరాకరించింది. దీంతో తెలంగాణ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సీఐ శ్రీనివాసులు రెడ్డి సవాల్ చేశారు.

## బొల్లారం ఆయుధాల చోరీ కేసు.. వెలుగులోకి సంచలన విషయాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 22: బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ కేసులో నిందితుడు మల్లేష్‌ను విచారించిన పోలీసులు.. అతడి నుంచి పలు సంచలన విషయాలు రాబట్టారు. నాలుగు నెలల ముందే అతడు ఈ ఆయుధాల చోరీకి పథక రచన చేసినట్లు బొల్లారం పోలీసులు గుర్తించారు.ఆదివారం.. సెలవు దినం కాబట్టి ఆ రోజే ఆయుధాలను చోరీ చేయాలని అతడు ముందుగా ప్లాన్ వేశాడని తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం రోజు గార్డ్ ఇన్‌చార్జులు, ఆర్మీ అధికారుల కదలికలు తక్కువగా ఉంటాయని అతడు గుర్తించి.. ఈ నిర్ణయం తీసుకున్నాడని వివరించారు. దీంతో ఆ రోజే ఆయుధాల చోరీకి అతడు స్కెచ్ వేశాడని చెప్పారు.అలాగే చోరీ చేసిన ఆయుధాలను సంఘ విద్రోహశక్తులకు విక్రయించాలని మల్లేష్ భావించాడని పోలీసులు పేర్కొన్నారు. అందుకోసం ఆయుధాలు కొనుగోలు చేసే వ్యక్తుల కోసం సోషల్ మీడియాలో అతడు తీవ్రంగా వెతికినట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. తద్వారా వచ్చిన నగదుతో తన ఆర్థిక నష్టాలను పూడ్చుకోవాలని మల్లేష్ నిర్ణయించాడని అన్నారు. మూడేళ్ల పాటు సర్వీస్ ఉన్నప్పటికీ.. విధుల నుంచి తొలగించడంతో ఆర్మీ అధికారులపై మల్లేష్ కక్ష పెంచుకున్నాడని తెలిపారు.దీంతో మద్రాస్ బెటాలియన్ నుంచి ఆయుధాలు చోరీ చేయడం ద్వారా ఆ అధికారుల ప్రతిష్ఠ దెబ్బతీయాలని మల్లేష్ ఈ పథకం వేశాడని వివరించారు. దాదాపు 16 ఏళ్ల పాటు మద్రాస్ రెజిమెంట్‌లో మల్లేష్ విధులు నిర్వహించాడని పోలీసులు చెప్పారు.మద్రాస్ రెజిమెంట్‌లో సీసీటీవీ కెమెరాలు.. ఎప్పుడు ఆఫ్ చేస్తున్నారంటూ వారిని మల్లేష్ ఆరా తీసిన వారు వెల్లడించారు.

# ఆదిలాబాద్ రిమ్స్‌లో ఘోర విషాదం.. అగ్నిప్రమాదంలో ఇద్దరు పసికందుల మృతి

ఆదిలాబాద్ :తెలంగాణలోని ఆదిలాబాద్ రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లో సోమవారం అర్ధరాత్రి ఘోర విషాదం చోటుచేసుకుంది. ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ)లో అగ్నిప్రమాదం జరగడంతో ఇద్దరు నవజాత శిశువులు మరణించారు. అప్రమత్తమైన సిబ్బంది వార్డులోని మరో 28 మంది చిన్నారులను సురక్షితంగా బయటకు తరలించడంతో పెను ప్రమాదం తప్పింది.సోమవారం రాత్రి సుమారు 11:50 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఎయిర్ కండిషనర్ (ఏసీ)లో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు అధికారులు భావిస్తున్నారు. కొద్దిసేపట్లోనే వార్డు మొత్తం దట్టమైన పొగ, అగ్నికీలలతో నిండిపోయింది. అయితే, ప్రమాదానికి కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, దర్యాప్తు తర్వాతే స్పష్టత వస్తుందని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.ఈ దురదృష్టకర ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై లోతుగా విచారణ జరుపుతున్నారు.





ముఖ్యంగా ఎస్ఎన్‌సీయూలోని ఎలక్ట్రికల్ వ్యవస్థ, ఏసీ పరికరాలు, అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు సరిగ్గా ఉన్నాయా? లేదా? అనే కోణంలో దర్యాప్తు సాగనుంది. ఈ మరణాలకు సిబ్బంది నిర్లక్ష్యం ఏమైనా కారణమా? అనే అంశాన్ని కూడా తేల్చనున్నారు.సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి.. విచారణకు ఆదేశంరిమ్స్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఇద్దరు శిశువులు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనలో ప్రభావితమైన మిగతా చిన్నారులందరికీ అత్యుత్తమ వైద్యం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదంపై ఉన్నతస్థాయి విచారణ జరిపి, సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆసుపత్రుల్లో ఫైర్, ఎలక్ట్రికల్ భద్రతా చర్యలను పటిష్ఠం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మాజీ మంత్రి జోగు రామన్న ప్రమాదం జరిగిన రిమ్స్‌ను

# యువ వికాసంపై చిగురిస్తున్న ఆశలు

బెజ్జూరు(కుమరం భీం): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'రాజీవ్ యువ వికాసం' పథకానికి శ్రీకారం చుట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా వారికి ఆర్థిక సాయం అందించాలనేది దీని ఉద్దేశం. ఇందులో భాగంగా గత ఏడాది మార్చి 14వ తేదీ వరకు 'మీసేవా' ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. ఆ తర్వాత నుంచి తదుపరి ప్రక్రియలో కదలిక కనిపించలేదు. జిల్లాకు 8,879 యూనిట్లు మంజూరు చేయాలనేది లక్ష్యం కాగా, జిల్లాలో 30,022 దరఖాస్తులొచ్చాయి. విచారణ ప్రక్రి య ఇంకా పూర్తి కాలేదు.యువ వికాసం పథ కం తొలి విడతగా నవంబరు 19 నుంచి లబ్ధి దారులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందిం చనున్నట్లు ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమా ర్క తాజాగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని యువతలో ఆశలు చిగురింప జేస్తున్నాయి. వాస్తవా నికి గత ఏడాది జూన్ 2వ తేదీనే యూనిట్ల రుణ పత్రాలు అందిస్తారని




భావించగా, అప్పట్లో దీనిపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదు. అప్పటి నుంచి మం జూరు ప్రక్రియ వాయిదా పడుతూ వస్తోంది. అయితే గతంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధి దారులను ఎంపిక చేస్తారా? లేక మళ్లీ కొత్త దరఖాస్తులు స్వీకరిస్తారా? అన్నదానిపై ఎలాంటి స్పష్టత లేదు. అధికార వర్గాల సమాచారం మేరకు గతంలో దరఖాస్తులు చేసుకున్న వారికే ప్రాధాన్యత ఉంటుందని ఓ అధికారి తో చెప్పారు. లబ్ధి దారుల ఎంపిక బాధ్యత కలెక్టర్‌దే.గతంలో చేసిన దరఖాస్తులను పరిశీలిస్తారా అనేదానిపై పూర్తి స్థాయిలో స్పష్టత లేక నిరుద్యోగ యువతలో గందరగోళం నెలకొంది. మండల, మున్సిపల్, జిల్లాస్థాయి కమిటీల పరిశీలన ద్వారా తుది జాబితా కలెక్టర్‌కు అందజే స్తారని సమాచారం. ఈ సారి మాత్రం యువ వికాసం లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగానే ఉన్నట్లు తెలు స్తోంది. నవంబరు తొలి వారంలోనే ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఊరిస్తూ వస్తున్న ప్రభుత్వం..రాష్ట్రంలో అర్హులైన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం రాజీవ్ యువ వికాసానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం తొలి నుంచి ఈ పథకం అమలుపై ఊరిస్తూ రావడంతో దరఖా స్తుదారుల్లో ఆందోళన నెలకొనగా, ఎట్టకేలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పథకం అమలుపై స్పష్టత ఇవ్వడంతో నిరుద్యోగ యువతలో ఆశలు చిగురింపజేస్తున్నాయి. నవం బరు 19నుంచి తొలి విడతలో ఎంపిక చేసిన యువతకు సాయం అంది స్తామని ప్రకటిం చడంతో పథకం అమలులో కదలిక వచ్చినట్లేనని తెలుస్తోంది. 2025 జూన్ 2న రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా ముందుగా రూ.50వేల సాయం అందిం చాలని లక్ష్యం పెట్టుకోగా, పలు కారణాల దృష్ట్యా అమలు కాలేదు. మళ్లీ ఇన్నాళ్లకు రుణాలు ఇచ్చేం దుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో పథకం అమలుపై ఆశలు రేపుతున్నాయి.

## పోలీసోళ్లు మనుషులా.. పశువులా..? వినయ్ భాస్కర్‌పై దాడిపై మహిళల ఆగ్రహం



వరంగల్ :ఎంజీఎం హాస్పిటల్‌లోని పైకప్పు పెచ్చులు ఊడి గాయాలైన రోగుల పరిస్థితి తెలుసుకునేందుకు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఎంజీఎం ఆసుపత్రిలో వెళ్లే క్రమంలో ఆయనను అడ్డుకున్న పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించారని తెలిసిందే. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ వినయ్ భాస్కర్ కడుపులో తన్నారు. పోలీసులు కడుపులో తన్నారని, దాడిలో తన చేయి విరిగిందంటూ వినయ్ భాస్కర్ కంటతడి పెట్టుకున్నారు.కాగా ఈ ఘటనపై అక్కడే ఉన్న మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంజీఎం ఆసుపత్రి వద్ద వినయ్ భాస్కర్‌ను అడ్డుకొని దాడి చేసిన పోలీసుల తీరుపై మండిపడ్డారు. పోలీసులకేంది.. ఎందుకు ఆపాలి.. వాళ్లను ఎందుకు కొట్లాలి. పోలీసులు ఎందుకు ఆపాలి వాళ్లను.. మనుషులా.. దున్నపోతులా..? ఆయన మా న్యాయం మాకు చేస్తుండు.. పోలీసోళ్లు కొట్టుడు అవసరమా..? వీళ్లను తీసేయాలంటూ ఫైర్ అయ్యారు.ప్రవర్తనపై బీఆర్ఎస్ నేతలతోపాటు స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు.

## ఫాం పాండ్‌లపై రైతుల ఆసక్తి



ఇల్లంతకుంట(కరీంనగర్): చేనులో పడిన వర్షపు నీరు వృథాగా పోనివ్వకుండా అక్కడే నీటిని నిలువ చేసుకునేందుకు నిర్మిస్తున్న ఫాం పాండ్‌లపై రైతులు ఆసక్తి కనబర్చుతున్నారు. పంటల సాగుసమయంలో వర్షాలు సకాలంలో కురవకపోవడం, పంటవేసిన తర్వాత వర్షం పడకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితులను అధిగమించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వీబీజీరాంజీ పథకం క్రింద రైతులు ఫాంపాండ్‌లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించింది.రైతులు ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టకుండానే ఉపాధిహామీ కూలీల ద్వారా దీన్ని నిర్మిస్తున్నారు. 8మీటర్ల పొడవు, 8మీటర్ల వెడల్పుతో 6ఫీట్ల లోతుతో వరదనీరు వచ్చే ప్రాంతలో కూలీలతో గుంత తవ్వడంతో పాటు ఇన్‌లెట్, అవుట్‌లెట్‌లను నిర్మిస్తారు. దీనికి ప్రభుత్వం ఉపాధిహామీ కూలీ లకు రూ. 50వేలు ఖర్చు చేస్తుంది. భూమికోతకు గురికాకుండా రాతి కట్టడం వల్ల నీరు ఎక్కువ రోజులు నిలువ ఉంటుంది.ఫాంపాండ్‌ల నిర్మాణాలలో రైతుల ఆసక్తుల మేరకు కొలతలను ప్రభుత్వం నిర్ణయించింది. మండలంలోని ముస్కానిపేట, ఇల్లంతకుంట, జంగమరెడ్డిపల్లె, గాలిపెల్లి తదితర గ్రామాలలో ఇప్పటికే 24ఫాంపాండ్‌ల నిర్మాణాలు జరిగాయి. ఇవే కాకుండా అనంతగిరి, సిరికొండ గ్రామాల్లో కమ్యూనిటీ ఫాంపాండ్‌ల పనులు కొనసాగుతున్నాయి. వీటి నిర్మాణాల వల్ల రైతులకు ప్రయోజనాలు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు

# ఆర్టీవో కార్యాలయంలో ఏసీబీ ఆకస్మిక సోదాలు

బండ్లగూడ పాతబస్తీ బండ్లగూడలోని దక్షిణ మండలం ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో సోమవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక దాడులు చేయడంతో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఆర్టీఏ కార్యాలయానికి చెందిన కానిస్టేబుల్ అరుణ్ కరెన్సీ నోట్లు లెక్కిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై వార్తా కథనాలు రావడంతో సోమవారం ఉదయం నుంచి ఆర్టీఏ కార్యాలయంలో అధికారులు, సిబ్బందిలో ఆందోళన నెలకొంది.జాయింట్ ట్రాన్స్?పోర్టు కమిషనర్ కార్యాలయానికి వస్తున్నారని సమాచారం వచ్చింది. అంతలోనే ఆర్టీవో రామచందర్, ఇన్‌స్పెక్టర్ భీమ్‌సింగ్, కానిస్టేబుల్ అరుణ్ జేటీసీ కార్యాలయానికి హుటాహుటిన బయలుదేరి వెళ్లారు. అంతకుముందే విజిలెన్స్ అధికారులు గోప్యంగా కార్యాలయాన్ని, పరిసరాలను పరిశీలించి వెళ్లారు. ఏసీబీ అధికారులు ఆర్టీఏ కార్యాలయాన్ని దిగ్బంధనం చేశారు. వచ్చీ రావడంతోనే ప్రధాన గేటును మూసివేశారు. కొందరు ఏజెంట్లు, వారి సహాయకులు పరుగులు పెట్టారు.రాత్రి అయినా కొనసాగిన విచారణఅనిశా అధికారులు వారిని వెంబడించి పట్టుకున్నారు. అందరినీ ఆర్టీవో కార్యాలయంలోకి తీసుకెళ్లి తలుపులు మూసివేశారు. సెల్?ఫోన్?లను స్వాధీనం చేసుకున్నారు. భయభ్రాంతులకు గురైన ఏజెంట్లు, దుకాణదారులు, జిరాక్స్? సెంటర్ల వ్యాపారులు




షట్టర్లు వేసి పలాయనం చిత్తగించారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి అనిశా అధికారుల విచారణ మొదలైంది. ఒక్కొక్కరిగా విచారించిన అధికారులు అనుమానం లేని వారిని బయటికి పంపించి వేశారు.కార్యాలయంలోని సొరుగులు, డెస్క్‌లలో ఉన్న దరఖాస్తు పత్రాలను, ఫైళ్లను పరిశీలించారు. సిబ్బంది వద్ద ఉన్న నగదుపై ఆరా తీశారు. ఆన్‌లైన్ చెల్లింపులపై సమగ్రంగా విచారించారు. ఆర్టీఏ అధికారులు, సిబ్బంది లోపల బంధీలవడం, వారి సమాచారం లేకపోవడంతో వారి కుటుంబ సభ్యులు కార్యాలయానికి వచ్చి ఆందోళనతో వాకబు చేయడం కనిపించింది.ప్రధాన గేటు లోపల ఉన్న మొత్తం 60 మంది అధికారులు, సిబ్బంది, దరఖాస్తుదారులు, ఏజెంట్లు, ప్రైవేటు వ్యక్తులను విచారించాం. 30 మంది దరఖాస్తుదారులు, కొందరు వ్యక్తులను విచారించి బయటికి పంపాం. కొందరు సిబ్బందికి ఏజెంట్లతో సంబంధాలు ఉన్నాయని తెలిసింది. కొందరి వద్ద స్వల్ప నగదు లభించింది. అనుమానాస్పద యూపీఐ చెల్లింపులు మా వచ్చాయి. వైరల్ అయిన వీడియోపైనా దర్యాప్తు చేస్తున్నాం.

## విద్యుత్ డిమాండ్ బాగా పెరిగింది.. అంతరాయాలు లేకుండా చేస్తున్నాం: గొట్టిపాటి రవికుమార్



**అమరావతి, సెప్టెంబర్ 22:** ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరిగిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మంగళవారం) మీడి యాతో మాట్లాడుతూ.. గతేడాది ఇదే రోజు ల్లో కేవలం 240 మిలియన్ యూనిట్లుగా ఉందని.. ఇప్పుడు రోజువారి వినియోగం 290 మిలియన్ యూనిట్లకు చేరిందని వెల్లడించారు. అధిక ఎండల వలన ఈ ఏడాది దాదాపు 20 శాతంపైగా విద్యుత్ వినియోగం పెరిగిందని వివరించారు. జెన్కో సంస్థ రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నా పెరిగిన వినియోగంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా బయట నుంచి కొనుగోళ్లు చేసి విద్యుత్ అంతరాయాలు లేకుండా చూస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలలో పవర్ కట్స్ లేకుండా చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. సీఎం చంద్రబాబు ప్రతి వారం విద్యుత్ శాఖపై సమీక్ష చేసి దిశానిర్దేశం చేస్తున్నారని అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా విద్యుత్ సమస్యలు ఉత్పన్నమయ్యా యన్నారు. మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుతో పాటు పలు రాష్ట్రాల్లో విద్యుత్ స్కేర్ సిటీ ఉందని వెల్లడించారు. అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తున్నా...పెద్దగా ప్రయోజనం ఉండటం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడటానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

# ఏపీ పట్టణాలకు కొత్త కళ.. రూ.11,359 కోట్ల భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం



ష్ట్రవ్యాప్తంగా రూ.11,359 కోట్ల పట్టణ అభివృద్ధి పనులకు శ్రీకారం హెచ్ఏఎం పద్ధతిలో తొలిసారిగా 123 మున్సిపాలిటీల్లో పనుల ప్రారంభం కుప్పం నుంచి లాంఛనంగా పనులను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు సుమారు 2,165 కిలోమీటర్ల రోడ్లు, 502 పార్కుల నిర్మాణం లక్ష్యం శాంతిపురం వద్ద హంద్రీనీవా కాలువకు జలహారతి ఇవ్వనున్న ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పట్టణాల రూపురేఖలను సమూలంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ఒక బృహత్తర కార్యక్రమానికి నేడు శ్రీకారం చుట్టనుంది. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) విధానంలో రూ.11,359 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గమైన కుప్పం నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని 106 నియోజకవర్గాల పరిధిలో ఉన్న 123 మున్సిపాలిటీల్లో ఏకకాలంలో పనులు మొదలు కానున్నాయి. ఈ మెగా ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రూ.7,469 కోట్లు, గ్రేటర్

కిలోమీటర్ల
కిలోమీటర్ల
కిలోమీటర్ల
కిలోమీటర్ల

విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలో ప్రత్యేకంగా రూ.3,890 కోట్ల విలువైన పనులను చేపట్టనున్నా రు. ఈ నిధులతో ప్రధానంగా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా రోడ్ల నిర్మాణానికి రూ.4,656 కోట్లు, సెంట్రల్ మీడియన్ల ఏర్పాటుకు రూ.88 కోట్లు, కొత్త స్ట్రీట్ లైటింగ్ కోసం రూ.247 కోట్లు, పార్కుల అభివృద్ధికి రూ.509 కోట్లు కేటాయించారు. ఈ కార్యక్రమం పూర్తయితే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,165 రోడ్లు, 502 పార్కులు, 210 సెంట్రల్ మీడియన్లు, 391 మేర స్ట్రీట్ లైటింగ్, 300 సీవరేజ్ డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి వస్తాయి. పట్టణ స్థానిక సంస్థలపై ఒకేసారి ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ పనులను హెచ్ఏఎం పద్ధతిలో అమలు చేస్తోంది. ఈ విధానంలో కాంట్రాక్టర్లు తమ సొంత నిధులతో పనులు పూర్తిచేయగా, ప్రభుత్వం వారికి వార్షిక వాయిదాల రూపంలో చెల్లింపులు చేస్తుంది. కుప్పంలో పనులు ప్రారంభించిన తర్వాత సీఎం చంద్రబాబు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎమ్మెల్యేలు, మునిసిపల్ శాఖ అధికారులతో మాట్లాడి దిశానిర్దేశం చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి వద్ద హంద్రీనీవా కాలువను సందర్శించి కృష్ణా జలాలకు సీఎం జలహారతి ఇవ్వనున్నారు. అనంతరం ఈసీ పాల్ట్రీ షెడ్ కార్యక్రమం కింద ఎంపికైన కొందరు లబ్ధిదారులతో ముచ్చటించి, మధ్యాహ్నం పార్టీ కేడర్‌తో జరిగే సమావేశంలో పాల్గొననున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో తగ్గేదేలే



**అనంతపురం జిల్లా, సెప్టెంబర్ 22 :** స్థానిక సంస్థల ఎన్నికలపై ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో తగ్గేదేలేదని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మన కుటుంబ సభ్యుడేనని తెలిపారు. కుటుంబ సమస్యలు నాలుగు గోడల మధ్య కూర్చొని మాట్లాడుకుందామని చెప్పుకొచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 94 శాతం కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకుందామని ధీమా వ్యక్తం చేశారు. అహంకారం పక్కనపెట్టి ప్రజల్లో ఉందామని టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఫ్యాక్షనిజానికి వ్యతిరేకంగా పరిటాల రవీంద్ర పోరాడారు.. (మంగళవారం) అనంతపురం జిల్లాలోని రాప్తాడులో మంత్రి లోకేశ్ పర్యటించారు. ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నేతలతో లోకేశ్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగించారు. ఫ్యాక్షనిజానికి వ్యతిరేకంగా పరిటాల రవీంద్ర పోరాడారని కొనియాడారు. అరాచకాలను భూస్థాపితం చేసిన నాయకుడు పరిటాల రవి అని కీర్తించారు. మెగా డీఎస్సీపై వైసీపీ నేతలకు కోర్టులు చివాట్లు పెట్టాయని.. అయినా వైసీపీ నేతలకు ఇంకా బుద్ధిరాలేదని ఆగ్రహించారు. గొడ్డలితో బతికే వారు గొడ్డలితోనే పోతారు. రాయలసీమలో మహిళలపై దాడులకు పాల్పడుతున్న ఆనాటి పాలకులకు పరిటాల రవి ఫుల్‌స్టాప్ పెట్టారని లోకేశ్ ప్రస్తావించారు. వైసీపీ హయాంలో తన పాదయాత్రను అడ్డుకునేందుకు జీవోలు తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. నందమూరి బాలకృష్ణను మూడుసార్లు గెలిపించి శాసనసభకు పంపించిన ఘనత అనంతపురం జిల్లాది అని ఉద్ఘాటించారు. గొడ్డలితో బతికే వారు గొడ్డలితోనే పోతారని ఎద్దేవా చేశారు. పాఠాలు చెప్పే టీచర్లపై వైసీపీ నేతలు ఎలా దాడి చేశారో మనం చూశామని పేర్కొన్నారు. డీఎస్సీపై ఎప్పుడైనా చర్చకు సిద్ధం. 'డీఎస్సీపై నేను ఎప్పుడైనా చర్చకు సిద్ధమని... జగన్ నువ్వు సిద్ధమా' అని లోకేశ్ సవాల్ చేశారు. జగన్‌లాగా తాము విదేశాలకు వెళ్లాలంటే కోర్టు నుంచి పర్మిషన్ తీసుకోవడం లేదని విమర్శించారు. తాము నీతి నిజాయితీగా బతికామని ఉద్ఘాటించారు. వైసీపీలో కొన్ని రౌడీ మూకలు ఉన్నాయని.. టీచర్లపై కోడిగుడ్లు వేసి దాడి చేస్తారా..? అని ఆగ్రహించారు. టీచర్లపై దాడి చేసిన వారిని ఎవర్నీ వదిలిపెట్టబోనని హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారి పేర్లు రెడ్ బుక్కులో రాసుకున్నానని తెలిపారు. రెడ్ బుక్కులో ఉన్న వారిని వదిలిపెట్టబోనని స్పష్టం చేశారు.

## ఏడాది తర్వాత డీఎస్సీలో అక్రమాలంటూ మాట్లాడుతారా.. వైసీపీపై అనిత ఫైర్



**ప్రకాశం, :** డీఎస్సీపై వైసీపీ చేస్తోన్న రాద్ధాంతంపై హోం మంత్రి వంగల పూడి అనిత తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. (గురువారం) మీడియాతో మాట్లాడు తూ. డీఎస్సీ జరిగి ఏడాది అవుతోందని.. ఇప్పు డు బయటకు వచ్చి డీఎస్సీలో అక్రమాలు జరి గాయని వైసీపీ నాయకులు మాట్లాడటం సరి కాదని మండిపడ్డారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నెలకోసారి ప్రెస్‌మీట్ పెట్టి ఏది పడితే అది మాట్లాడి వెళ్లడం అలవాటైందని విమర్శించారు. అసలు వాస్తవాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఉద్యోగాలు పొందిన వారికి కూడా పరిస్థితులపై పూర్తి అవగాహన ఉందని చెప్పారు. కూటమి ప్రభుత్వ పని తీరును గమనించి రాబోయే స్థానిక ఎన్నికల్లో ఓటు రూపంలో ప్రజలే తీర్పు ఇస్తారని హోం మంత్రి అనిత పేర్కొన్నారు. ఏపీపీఎస్సీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని దారి మళ్లించడానికే డీఎస్సీపై నిందలు వేస్తున్నారంటూ వైసీపీపై టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేశ్ మండిపడ్డారు. ఏపీపీఎస్సీపై జగన్ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. డీఎస్సీపై మంత్రి నారా లోకేశ్ సవాల్‌కు గొడ్డలి పార్టీ ఎందుకు స్పందించలేదని అడిగారు. డీఎస్సీపై.. చెప్పిన అబద్ధాన్నే 100 సార్లు చెప్పడం జగన్ నైజమని వ్యాఖ్యానించారు. డీఎస్సీపై జగన్ రోజుకో అబద్ధం చెబుతున్నారన్నారు. గత ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేని అసమర్థ సీఎం జగన్ అంటూ విరుచుకుపడ్డారు. డీఎస్సీపై వైసీపీ నాయకులు వేసిన 320 కేసులను కోర్టు కొట్టివేసిందని తెలిపారు. ఏపీపీఎస్సీని జగన్ అవహేళన చేశారని విమర్శించారు.

## గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు.. సిట్ ఎదుట ఏ4 సురేశ్ లొంగుబాటు




**విజయవాడ,** గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏ4గా ఉన్న సురేశ్.. సిట్ కార్యాలయంలో లొంగిపోయాడు. సాయికృష్ణ మృతి అనంతరం చోటుచేసుకున్న పరిణామాల్లో సురేశ్ పాత్రపై ఇప్పటికే పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాయికృష్ణ మృతదేహం మాయంచేసిన వ్యవహారంలో అతడు కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు రావడంతో.. ఆ దిశగా సిట్ అధికారులు విచారణ చేపట్టారు. మరోవైపు.. సీఐ నాగరాజుకు సురేశ్ సన్నిహితుడిగానూ ఉన్నట్లు సమాచారం. సాయికృష్ణ కుటుంబ సభ్యులతో సెటిల్‌మెంట్ చేసేందుకూ సురేశ్ యత్నించినట్లు ఆరోపణలున్న నేపథ్యంలో.. ఆ వ్యవహారంపైనా దర్యాప్తు అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. కస్టోడియల్ డెత్‌కు దారితీసిన పరిస్థితులు, అనంతరం మృతదేహం మాయం కావడానికి కారణాలు, ఈ పరిణామాల్లో సురేశ్ పాత్ర ఎంతమేరకు ఉందనే అంశాలపై సిట్ అధికారులు దృష్టి సారించారు. విచారణ అనంతర మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

## వైఎస్సార్సీపీ అరాచకంపై ఆగ్రహజ్వాలలు గురువుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని తీవ్ర విమర్శలు



**అమరావతి, సెప్టెంబర్ 22:** శాప్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులపై వైఎస్సార్సీపీ గూండాలు తెగబడటంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గురువులపై జగన్, వైఎస్సార్సీపీ నేతలు విషం కక్కుతున్నారని మంత్రులు మండిపడ్డారు. గ్రూప్ – 1లో అక్రమాలు కప్పిపుచ్చుకునేందుకే డీఎస్సీపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గురువులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే విమర్శలు : శాప్ కార్యాలయం వద్ద వైఎస్సార్సీపీ నాయకుల అరాచకంపై మంత్రులు మండిపడ్డారు. గురువుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వైఎస్సార్సీపీ నాయకులు వ్యవహరించారని అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులకు తెగబడిన ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు. ఉపాధ్యాయులపై దాడి వైఎస్సార్సీపీ నీచ రాజకీయాలకు నిదర్శనమని మంత్రులు పార్థసారథి, సవిత, డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. గ్రూప్ –1 అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే వైఎస్సార్సీపీ నేతలు రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ ఇవ్వని జగన్ క్రీడాకారులు, ఉపాధ్యాయులపై దాడులు చేయించడం దారుణమని రాజ్యసభ ఎంపీ చింతకాయల విజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ రాజకీయ పార్టీనా, రౌడీ పార్టీనా అని ఎమ్మెల్సీ వర్ల రామయ్య ప్రశ్నించారు. హింసను ఆశ్రయించే వారికి ప్రజలే సరైన బుద్ధి చెబుతారని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు చెప్పారు. వైఎస్సార్సీపీ జారీ చేసిన సర్టిఫికెట్లను ఇప్పుడు ఆ పార్టీ నేతలే ఫేక్ అంటూ ప్రచారం చేయడం రాజకీయ దివాళాకోరుతనమని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు.
చేశారు. ఇది పౌర సమాజం ఖండించాల్సిన అమానుషమైన చర్య. ఉపాధ్యాయులపై దాడిలో పాల్గొన్న వారందరికీ కఠిన శిక్ష విధించాలి. క్రీడాకారులు, ఉపాధ్యాయులను అవమానించడం వైఎస్సార్సీపీ దుర్మార్గపు మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుంది. 'గొడ్డలి పార్టీ' నాయకులు శాప్? కార్యాలయంలో హింసకు పాల్పడటం దిగ్భ్రాంతికరం. ఇటువంటి అనాగరిక ప్రవర్తనను ప్రతి ఒక్కరూ ఖండించాలి"– టీడీపీ మంత్రులు .దాడికి పాల్పడిన వారికి కఠిన శిక్ష : రాజకీయ వివాదాల్లోకి ఉద్యోగులు, టీచర్లను లాగడం సరికాదని ఏపీ సెక్రటేరియట్ అసోసియేషన్ మండిపడింది. ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం, రాజకీయ పార్టీలపై ఉంటుందని స్పష్టం చేసింది. రాజకీయ ముసుగులో ఉపాధ్యాయులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీటీఎఫ్? డిమాండ్ చేసింది. భవిష్యత్తులో గురువుల జోలికి రావాలంటేనే భయపడేలా ఉపాధ్యాయ భద్రత చట్టాన్ని రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరింది.

# 'అసలు డీఎస్సీ అంటే నీకు అర్థం తెలుసా' జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు ఫైర్



**ప్రకాశం, సెప్టెంబర్ 22:** డీఎస్సీపై ఓ క్రిమినల్ ఆరోపణలు చేస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజకీయ పార్టీ ముసుగులో క్రిమినల్ రాజకీయం చేస్తున్నార న్నారు. నిన్న(సోమవారం) విజయవాడలో టీచర్లపై దాడి జరిగిన సంఘటన దారుణమన్నారు. వైసీపీకి చెందిన గూండాలు ధర్నాలో పాల్గొన్నారని తెలిపారు. గతంలో భూ దోపిడీ, మైనింగ్ కేసుల్లో ఉన్నవారు నిన్న పాల్గొన్నార న్నారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగా పాలన చేయాలని చేస్తున్నామని చెప్పారు. 'జగన్.. నీకు అసలు సిగ్గు ఉందా.. డీఎస్సీ గురించి మాట్లాడే అర్హత ఉందా. అసలు డీఎస్సీ అంటే నీకు అర్థం తెలుసా' అంటూ ఫైర్ అయ్యారు. తాము సిస్టమాటిక్‌గానే డీఎస్సీ ఉద్యోగాలు ఇచ్చామని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో ఆంధ్రప్రదేశ్ లో ఎప్పుడూ లేని విధంగా అవినీతి చేశారని మంత్రి ఆరోపించారు. అతి తక్కువ సమయం లో తమ నాయకుడు లోకేశ్‌కు కేంద్ర స్థాయిలో మంచి గుర్తింపు వచ్చిందన్నారు. దాన్ని తట్టుకోలేకే లోకేశ్‌పై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ చేస్తున్న ఆరోపణలన్నీ అసత్యమని నిరూపించా మన్నారు. నిన్న జరిగిన సంఘట నలో నిందితులను వదిలి పెట్టమని.. చర్యలు తప్పవు మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చ రించారు. (మంగళవారం) ఒంగోలులో ది ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిట ెడ్ కార్యాలయాన్ని మంత్రి డోలా శ్రీబాలా వీరాంజనేయ స్వామితో కలిసి అచ్చెన్నాయుడు ప్రారంభిం చారు. బ్యాంకులు గ్రామీణ ప్రాంతాలను ఆర్థికంగా బలపరుస్తూ వస్తున్నాయ ని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. గత ఐదు సంవత్సరాల్లో సహకార బ్యాంకులకు ఎన్నికలు కూడా పెట్టలేదని.. వైసీపీ ప్రభుత్వంలో అవినీతి కార్యక్రమాలు చేస్తూ, సహకార బ్యాంకులను దోచుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దోపిడీని అరికట్టామని తెలిపారు. కమర్షియల్ బ్యాంక్‌లు పద్ధతి ప్రకారం ఖర్చు పెడతాయని.. ఆ మాదిరిగానే సహకార బ్యాంకులను కూడా ఆన్‌లైన్ చేసి అవినీతిని అరికట్టామని అన్నారు. ఈ ఏడాది సూపర్ ఎల్‌నినో వచ్చిందని.. చాలా ప్రాంతాల్లో కరవు వచ్చిందన్నారు. ఈనెల 30న కరవు ప్రాంతాలను వెల్లడించే అవకాశం ఉందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, ఉగ్ర నరసింహారెడ్డి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఎబ్యాంక్ చైర్మన్ సీతారామయ్య హాజరయ్యారు.

## ఏపీలో 196 ఏఎస్‌వో ఖాళీ భర్తీకి నోటిఫికేషన్ విడుదల

**అమరావతి, సెప్టెంబర్ 22:** ఆంధ్రప్రదేశ్‌పబ్లిక్ సర్వీస్ కమిషన్ అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిద్వారా 196 ఖాళీలను భర్తీ చేయనుంది. అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. దరఖాస్తు ప్రక్రియ అక్టోబర్ 13 నుంచి ప్రారంభం కానుంది. నవంబర్ 2 వకు కొనసాగుతుంది. పోస్టులు ఏపీ ఎకనామిక్ అండ్ స్టాటిస్టికల్ సబార్డినేట్ సర్వీస్. మొత్తం 196 పోస్టులను నింపనుంది. అర్హతలుఅభ్యర్థులు స్టాటిస్టికల్ సబ్జెక్టుతో డిగ్రీ ఉత్తీర్ణులైనవారు అర్హులు. స్టాటిస్టికల్ ఒక సబ్జెక్టుగా మ్యాథమెటిక్స్, ఎకనామిక్స్, కామర్స్ సబ్జెక్టులతో డిగ్రీ చదివినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికసింగిల్ లెవల్ కంప్యూటర్ బేస్డ్ రిటన్ టెస్ట్ , కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తారు. రాత పరీక్ష పేపర్–1లో 150 (జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీ) ప్రశ్నలు, 150 మార్కులు, పేపర్–2లో 150 (ఎకనామిక్స్, అకౌంటింగ్, కంప్యూటర్స్ అండ్ స్టాటిస్టిక్స్) ప్రశ్నలు, 150 మార్కులు ఉంటాయి. ఎంపికైనవారికి నెలకు జీతం రూ. 37,640 -- 1,15,500 వరకు ఉంటుంది.


Printed, Published & Owned by Rachakonda Printers & Publication's at P. Mahesh Goud Office address :-Dwaraka nagarRoad no:6 Plot : 101500079 RR dist, Hyderabad TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H. No:- 5-2-396 Venkateshwara colony Saheb nagar Rangareddy 500070 TELANGANA STATE. EDITOR : P. Mahesh Goud 9908 502 602 , PRGI NO:- TGTEL/26/A6429. EMAIL: youvavelugu@gmail.com https://epaper.yuvavelugu.com